సాక్షి సంగారెడ్డి

శనివారం, 13, సెప్టెంబర్, 2025



నిమ్జ్ భూబాధితులకు బాసట

నిమ్జ్ భూ బాధితులకు న్యాయం జరిగేవరకు విశ్రమించేది లేదని వ్యవసాయ కార్మిక సంఘం స్పష్టం చేసింది. వివరాలు 8లో ▸



కార్లు అద్దెకు తీసుకుని

కార్లు అద్దెకు తీసుకుని వాటిని అమ్మేసుకుంటున్న ఓ ముఠాలోని సభ్యుడిని సిద్దిపేట పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు 8లో ▸



దారులు చిధ్రం.. జర భద్రం

జహీరాబాద్ పట్టణంలోని బీటీరోడ్లు అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

తారా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'దోస్త్'ద్వారా డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి మిగిలిన సీట్లకు ఈనెల 15, 16వ తేదీలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 94410 69020ను సంప్రదించవచ్చని తెలిపారు.

సింగూరుకు 6,136 క్యూసెక్కుల నీరు

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతుంది. గత రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోకి వరద పెరుగుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 6,136 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా..దిగువకు 2,329 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వదులుతున్నారు. జలవిద్యుత్ కేంద్రం ద్వారా రెండు టర్బయిన్లను ఆన్‌చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న భవానీచంద్ర

సంగారెడ్డి టౌన్: రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర పేర్కొన్నారు. కక్షిదారులకు న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐ పాఠంపై విద్యార్థుల ఆసక్తి: డీఈఓ



ఏఐ బోధనను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలో కృత్రిమ మేధ(ఏఐ) బోధనపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి ప్రభుత్వ పాఠశాలను డీఈఓ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పాఠశాల తరగతిగదిలో పర్యటించి, అక్కడ ఉపాధ్యాయులు చెపుతున్న బోధన తీరును పరిశీలించారు. అనంతరం ఏఐ బోధన ద్వారా పాటలు వింటున్న విద్యార్థులను చూశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... కంప్యూటర్ ఆధారిత బోధన ద్వారా విద్యార్థుల హాజరు శాతం పెరిగిందన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్‌గా విశాలాక్షి



జహీరాబాద్: జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్) ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్-2 గా విశాలాక్షి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ హైదరాబాద్ కార్యాలయంలో జేడీగా పని చేసిన ఆమెను జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆమె జహీరాబాద్ ఇన్‌చార్జి ఆర్డీఓ దెవుజాతో సమావేశమయ్యారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శుక్రవారం సీపీఎం మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'మతోన్మాదదాడులు–రాజ్యాంగం–లౌకికవాదం ఆవశ్యకత'అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ...సీతారాం ఏచూరి మృతి ప్రజలకు, పార్టీకి తీరని లోటన్నారు.

జెన్‌కో.. ఉత్పత్తి అదిరే

- ఈసారి ఇప్పటికే 7.54 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి
- పూర్తిస్థాయి నీటిమట్టం మేరకు నింపొద్దన్న డ్యామ్ సేఫ్టీ అథారిటీ
- జెన్‌కోకు కలిసొచ్చిన హెచ్చరిక
- ఇన్‌ఫ్లోను నదిలోకి వదలడంతోపాటు, విద్యుదుత్పత్తికి నీటి విడుదల

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : సింగూరు ప్రాజెక్టు నీటి నిల్వ విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) హెచ్చరిక కొంతమేరకు జెన్‌కోకు కలిసొచ్చినట్లయింది. ఈ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం మేరకు నీటిని నింపితే గండిపడే ప్రమాదం ఉందని, నీటి నిల్వను పరిమితం చేయాలని ఎన్‌డీఎస్‌ఏ ఇటీవల హెచ్చరించిన విషయం విదితమే. దీంతో ఈ ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోను గేట్లు ఎత్తి కిందికి వదిలేస్తున్నారు. అలాగే జెన్‌కోకు కూడా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఇక్కడి జల విద్యుదుత్పత్తి కేంద్రంలో పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు విద్యుదుత్పత్తి జరుగుతోంది. 7.5 మెగావాట్ల సామర్థ్యం చొప్పున ఉన్న రెండు యూనిట్ల ద్వారా 15 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతోంది. ఈ విద్యుదుత్పత్తి కేంద్రంలో ఈ ఏడాది ఆగస్టు 13 నుంచి ఉత్పత్తిని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 7.55 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసినట్లు జెన్‌కో వర్గాలు చెబుతున్నాయి. ఆగస్టు రెండో వారం నుంచి భారీ వర్షాలు కురిసాయి. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాల్లోనూ భారీ ఎత్తున వర్షపాతం నమోదైంది. దీంతో ఈ ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరింది. ప్రస్తుతం కూడా 4,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో జెన్‌కోకు 2,336 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నిర్దేశిత లక్ష్యం మేరకు ఉత్పత్తి

ఈ జలవిద్యుదుత్పత్తి కేంద్రంలో ఏటా 10 మిలియన్ యూనిట్ల నుంచి 14 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి చేయాలని లక్ష్యంగా ఉంది. అయితే ఇప్పటికే 7.5 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి జరగడంతో నిర్దేశిత లక్ష్యం మేరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఆ సంస్థ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మొత్తం 21 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి అయినట్లు జెన్‌కో వర్గాలు చెబుతున్నాయి. ఇది ఈ విద్యుదుత్పత్తి కేంద్రం ప్రారంభమైన నాటి నుంచి నాలుగో అత్యధిక విద్యుదు త్పత్తిగా రికార్డయింది. ఈ ప్లాంట్ చరిత్రలో అత్యధికంగా 2022–23 సంవత్సరంలో 30.425 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఏకంగా నవంబర్ వరకు విద్యుదుత్పత్తి జరగడంతో ఈ రికార్డు సాధ్యమైందని చెబుతున్నారు.



సింగూరు ప్రాజెక్టు వద్ద జెన్‌కో జల విద్యుదుత్పత్తి కేంద్రం యూనిట్లు

యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

మునిపల్లి(అందోల్)/సంగారెడ్డి జోన్: ఇటీవల కూలిపోయిన లింగపల్లి గురుకుల హాస్టల్ భవనం స్లాబ్ శిథిలాల తొలగింపు ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఈ స్థానంలో కొత్త భవనం నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య స్పష్టం చేశారు. మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న పనులను కలెక్టర్ శుక్రవారం స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల కోసం తాత్కాలికంగా రేకుల షెడ్డును పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...నూతన భవనం నిర్మించడానికి స్థలాన్ని త్వరితగతిన గుర్తించాలని, లేదంటే కూలిపోయిన భవనం స్థానంలోనే నిర్మించాలంటే శిథిలాలను తొలగించి స్థలం చదను చేయాలని సూచించారు. నూతన భవన నిర్మాణానికి, ఫర్నీచర్, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన అంచనా ప్రతిపాదనలను త్వరగా తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంబంధిత అధికారులు, ఎంపీడీఓ హరినంధ్‌రావు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ భవనంలో శిక్షణ

జహీరాబాద్: యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా హోటల్ మేనేజ్‌మెంట్ భవనంలో త్వరలో ఉపాధి శిక్షణ తరగతులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు. కోహీర్ మండలంలోని కవేలి గ్రామ శివారులోని నిరుపయోగంగా ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ భవనాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..వారంలోగా ఈ భవనాన్ని శుభ్రం చేసి అన్ని మౌలిక వసతులు కల్పించి ఓరియంటేషన్ ప్రోగ్రాంలు కూడా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కొల్లూరులోని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను మోడల్ కాలనీలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నీతమ్ డైరెక్టర్ వెంకటరమణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, జిల్లా ఉపాధికల్పనాధికారి అనిల్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ తుల్జరామ్, జహీరాబాద్ ఆర్డీఓ దెవుజా, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



లింగంపల్లి గురుకుల పాఠశాల పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

మున్సిపాలిటీల్లో కొత్త పోస్టులు

- ఆర్థిక శాఖ ఆమోదం
- పోస్టింగ్‌ల కోసం 27 మంది విలీన కార్యదర్శుల ఎదురు చూపులు
- మిగతా సిబ్బందికి ఇప్పటికే సర్దుబాటు

సంగారెడ్డి జోన్: పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలలో విలీనం చేసిన నేపథ్యంలో నాటి నుంచి పంచాయతీ కార్యదర్శులను పంచాయతీరాజ్ శాఖలో వేతనం పొందుతూ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే కొత్త ఏర్పడిన మున్సిపాలిటీలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 165 పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో జిల్లాకు 27 పోస్టులు ఉన్నాయి.

పోస్టులు మంజూరుకు ఆర్థిక శాఖ ఆమోదం

జిల్లాలో నాలుగు విడతల ద్వారా 45 గ్రామాలను సమీప మున్సిపాలిటీలలో విలీనం చేశారు. మొదటి, రెండవ విడతలలో విలీనం అయన కార్యదర్శులను మున్సిపల్ శాఖలోకి మార్చేందుకు కొత్తగా జిల్లాకు 27 పోస్టులను ఆర్థిక శాఖ మంజూరు చేసింది. పోస్టులు మంజూరు అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవటంతో పోస్టింగుల కోసం ఎదురుచూపులు తప్పలేదు. మూడు, నాలుగు విడతలలో విలీనమైన అధికారులకు పోస్టుల మంజూరు ఎప్పుడు చేస్తారోనని ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం వీరంతా మున్సిపల్ లోనే తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్నారు.

తాత్కాలిక పోస్టులతో విధుల నిర్వహణ

జిల్లాలో విలీన పంచాయతీ కార్యదర్శులు 45తోపాటు మల్టీపర్పస్ వర్కర్లు కూడా ఉంటారు. విలీనం అయిన నాటి నుంచి మున్సిపాలిటీలలో వారి గ్రేడ్‌ల ఆధారంగా రెవెన్యూ అధికారి, జూనియర్ అసిస్టెంట్, వార్డ్ అధికారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా వివిధ స్థాయిలలో తాత్కాలిక పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే వీరిని పంచాయతీరాజ్ శాఖలోని కొనసాగాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో కొంతమంది విలీన కార్యదర్శులు మున్సిపల్ శాఖలోని విధులు నిర్వహిస్తామంటూ కోర్టును ఆశ్రయించారు. విలీన కార్యదర్శులకు అనుకూలంగా కోర్టు స్టే ఇవ్వడంతో పంచాయతీరాజ్ శాఖకు మార్చే ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసింది.



మున్సిపల్ పరిధిలోకి విలీనమైన గుమ్మడిదల పంచాయతీ కార్యాలయం

మీడియాపై దాడి అప్రజాస్వామికం

సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి, జర్నలిస్టులపై అక్రమంగా కేసులు బనాయించడమేకాకుండా, కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్న ఏపీ ప్రభుత్వంపై వివిధ సంఘాల నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అక్రమాలను, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం మీడియా కర్తవ్యమని అన్నారు. నిరంకుశంగా వ్యవహరించడాన్ని ఏపీ ప్రభుత్వం తక్షణం మానుకోవాలని వారు హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వ నిర్బంధ చర్యలపై పలువురి నేతల అభిప్రాయాలు..

వారి మాటల్లోనే..



అది రాజ్యాంగం కల్పించిన హక్కు



సంగారెడ్డి జోన్: ప్రజాస్వామ్యంలో వార్తలు రాసే హక్కు పాత్రికేయులకు రాజ్యాంగం కల్పించిన హక్కు. అణిచివేయబడుతున్న వారికి మద్దతుగా నిలబడి, అన్యాయం చేస్తున్న వారి దౌర్జన్యాలను నిలదీస్తూ ప్రజలకు తెలియజేసే హక్కు పత్రికలకు ఉంది. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ప్రజలే సరైన బుద్ధి చెబుతారు.

– రాంచందర్ భీం వంశీ, ఉపాధ్యాయుడు, టీజేఏసీ చైర్మన్, జహీరాబాద్

కేసుల నమోదు అప్రజాస్వామికం



జహీరాబాద్: పాత్రికేయులపై కేసులు పెట్టడం అనేది అప్రజాస్వామికం. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమే. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న 'సాక్షి'పై కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదు. తపస్ ఉపాధ్యాయ సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం.

– దత్తాత్రి, తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు,జహీరాబాద్

ప్రశ్నించే గొంతు నొక్కడమే



జహీరాబాద్: సమాజంలో జరుగుతున్న అన్యాయాలను నిలదీసే వారిపై కేసులు పెట్టడం అంటే ప్రశ్నించే గొంతుకలను నొక్కడమే అవుతుంది. 'సాక్షి'ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటు విలేకరులపై ఏపీలోని కూటమి ప్రభుత్వం కేసులు బనాయించడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే.

– తులసీరాం రాథోడ్, టీబీఎస్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జహీరాబాద్

కేసులు పెట్టడం సరికాదు



సంగారెడ్డి టౌన్: పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం సరికాదు. ప్రజాస్వామ్య వ్యవస్థకు పత్రికలు మూలస్తంభాలు. ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా ఉండే వారిపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణం. ఏపీ ప్రభుత్వం పెట్టిన కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలి.

– మహమ్మద్ నిజాముద్దీన్ రషీద్, న్యాయవాది

కేంద్రం వల్లే యూరియా కొరత

రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వ విధానాలే యూరియా కొరతకు కారణమని, రైతులకు కావలసిన యూరియాను వెంటనే అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన కోటా ప్రకారం యూరియా, ఎరువులను సరఫరా చేయలేదని విమర్శించారు. రసాయన ఎరువులపై సబ్సిడీని కేంద్రం క్రమంగా కోత పెడుతూ నానో యూరియాను బలవంతంగా మోపే ప్రయత్నం చేస్తోందన్నారు. రాష్ట్రానికి 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. రాష్ట్రానికి వచ్చిన యూరియాను ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా రైతులు యూరియా సరఫరా కేంద్రాల వద్ద బారులు తీరి గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సకాలంలో ఎరువులు అందుబాటులో లేకపోతే పంటలు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే యూరియా కొరతను తీర్చాలని కోరారు.



కలెక్టరేట్ ఏఓ అంథోనికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

సేవాభావంతో మెలగాలి

ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్ రావు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతీ కార్యకర్త ప్రజలతో సేవాభావంతో మెలగాలని ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. జిన్నారం పట్టణ పరిధిలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవాకార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్యలో ఉండి వారి సమస్యలు పరిష్కరించేలా ముందుకు వెళ్లాలని చెప్పారు. ఈ నెల 17న ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరంలో ప్రతీ కార్యకర్త పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. అనంతరం ఇటీవల మృతి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు దోమడుగు రమేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాలికలకు చదువే భరోసా

- మంత్రి దామోదర రాజనర్సింహ
- ఆస్పత్రులకు వెళితే ఆర్థిక భారం పడకూడదన్నదే లక్ష్యం
- 126 మంది ఉపాధ్యాయులకు సన్మానం

వట్‌పల్లి (అందోల్): తాను గతంలో విద్యాశాఖ మంత్రిగా ఎనిమిదేళ్లు పనిచేశానని, ఇప్పటికీ ఆ శాఖ అంటే చాలా ఇష్టమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. అందోలు మండలం అల్మాయిపేట లక్ష్మీదేవి గార్డెన్‌లో శుక్రవారం జరిగిన నియోజకవర్గస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గురువు ఉన్న ప్రదేశంలో అక్కడి సమాజ ప్రవర్తన తెలుస్తుందని చెప్పారు. ఆస్పత్రికి వెళితే ప్రజలకు ఆర్థికభారం కలగకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్య, వైద్యం రెండు శాఖలు ముఖ్యమైనవేనని అందోల్ నియోజకవర్గంలో ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలు, మండలానికొక మోడల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. సమాజానికి బాలికల చదువు చాలా ముఖ్యమని, అమ్మాయిలు చదివితేనే కుటుంబానికి సంపూర్ణ భరోసా ఉంటుందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో రూ.15 కోట్లతో బాలికల విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజనర్సింహ అంటే గుర్తింపు రావడం అందోల్ నుంచే లభించిందన్నారు. అందుకే ఈ ప్రాంతానికి ఎప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. పీఆర్‌టీయు అధ్యక్షుడు ఎ. మాణయ్య అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, ఆర్డీఓ పాండు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దామోదర

చేపా..చేపా ఎప్పుడొస్తావు!

చేప పిల్లల పంపిణీలో ఈసారి మరింత ఆలస్యం!

- టెండర్లకు ముందుకురాని కాంట్రాక్టర్లు
- త్వరలోనే పంపిణీ చేస్తామంటున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): మత్స్యకారుల జీవనోపాధి కోసం ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ పథకం అమలు ఈ ఏడాది మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. జూలై మూడో వారంలోనే చేపట్టాల్సిన చేప పిల్లల పంపిణీ సెప్టెంబర్ వచ్చేసినా ఈ ప్రక్రియ టెండర్ల దశలోనే ఉండటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా పరిధిలో 36,029 హెక్టార్ల విస్తీర్ణంలో 1,135 నీటి వనరులు ఉండగా మూడు రిజర్వాయర్లు, 79 పెద్ద చెరువులు, 1,059 చిన్న చెరువులున్నాయి. 234 మత్స్య సహకార సంఘాలు ఉండగా వీటిలో 12,889 మంది సభ్యులున్నారు. ఈ ఏడాది 3.50 కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతేడాది 3.41 కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యం పెట్టుకోగా 68,31,132 చేప పిల్లలను వదిలినట్లు అధికారులు చెబుతున్నారు.

బిడ్లు దాఖలుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

ప్రభుత్వం జిల్లాలోని చెరువుల్లో చేప పిల్లలకు సంబంధించి గత నెల ఆగస్టు 18 నుంచి 30 వరకు టెండర్లను పిలువగా ఒక్కరూ కూడా టెండర్ వేయడానికి రాలేదు. ఇందుకు గతంలో ప్రభుత్వానికి సరఫరా చేసిన చేప పిల్లలకు సంబంధించి బిల్లులను చెల్లించకపోవడం వంటివి కారణాలుగా తెలుస్తోంది. దీంతో మరోసారి బిడ్లు వేయడానికి ఈనెల (సెప్టెంబర్) 12 వరకు బిడ్లు వేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించగా శుక్రవారం బాక్స్‌లను ఓపెన్ చేయగా ఒక్కరు మాత్రమే టెండర్ దాఖలు చేశారు. సాధారణంగా రాజమండ్రి, కైకలూరు ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లు మాత్రమే ఈ ప్రాంతంలో చాలాకాలంగా టెండర్లలో పాల్గొంటున్నారు.

రూ.లక్షలు పెట్టి కొనుగోలు

ఉచిత చేప పిల్లల పంపిణీ ఆలస్యమవుతుండటంతో మత్స్యకారులు సొంత ఖర్చులతో ప్రైవేట్‌గా కొనుగోలు చేసి చెరువులలో వదులుకుంటున్నారు. ప్రభుత్వం పంపిణీచేసే చేప పిల్లల సైజు తక్కువగా ఉండటంతో చెరువుల్లో నీరు తగ్గే సమయానికి చేప అరకిలో వరకు బరువు పెరగడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. దీంతో ఉచిత చేప పిల్లల కోసం ఎదురు చూడకుండా సొంత డబ్బులతో ఆంధ్రప్రదేశ్ నుంచి తీసుకువచ్చి వదులుతున్నామంటున్నారు. ఇటీవల అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లిలో మత్స్యకారులు సుమారుగా రూ.3లక్షలు వెచ్చించి ప్రైవేట్‌గా కొనుగోలు చేసి చెరువులలో వదిలారు.

పెరుగుదలపై ప్రభావం

చెరువుల్లో రెండు పరిమాణాల్లో చేప పిల్లలను వదులుతారు. పూర్తిగా నీటితో నిండిన చెరువుల్లో 45రోజుల వయసున్న 35–40 మి.మీ. పొడవున్న వాటిని, ఏడాది మొత్తం నీరు నిల్వ ఉండే పెద్ద చెరువులు, జలాశయాల్లో 75 రోజుల వయసున్న 80–100 మి.మీ. పొడవున్న వాటిని వదులుతారు. నీటిలో వదిలిన తర్వాత కిలో పరిమాణానికి రావాలంటే కనీసం ఆరు నెలలు పడుతుంది. జూన్, జూలై నెలల్లో వదిలితే డిసెంబరు నుంచి రెండు, మూడు నెలలపాటు చేపలను పట్టి విక్రయించుకునే అవకాశముంటుంది. దీంతో మత్స్యకారులు చేపల పంపిణీ కోసం ఎదురు చూస్తున్నారు.



ప్రైవేట్‌గా కొనుగోలు చేసి చేప పిల్లలు వదులుతున్న కన్‌సాన్‌పల్లి మత్స్యకారులు

అక్టోబర్ మొదటి వారంలో!

జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీ చేసేందుకు బిడ్లు ఆహ్వానించినా ఎవరూ రాకపోవడంతో రెండుసార్లు గడవు పొడిగించాం. త్వరలోనే టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేసి అక్టోబర్ మొదటి వారంలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలనుకుంటున్నాం. మత్స్యకారులు ఆందోళన చెందవద్దు. నాణ్యమైన చేప పిల్లలు చెరువుల్లో వదులుతాం.

– మధుసూదన్‌రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

క్లుప్తంగా

చేనేత హస్తకళ ప్రదర్శన



చేనేత హస్తకళ ప్రదర్శన

సిద్దిపేటజోన్: సిద్దిపేటలో చేనేత హస్తకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. చేనేత వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, జైపూర్ స్టోన్స్, ఉడెన్ హ్యాండ్ క్రాఫ్ట్స్ ఒడిశా పెయింటింగ్ తదితర ఉత్పత్తులు పలువురిని ఆకట్టుకున్నాయి.

చిరుత దాడి చేసిన స్థల పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని కరీంనగర్ అటవీ ప్రాంతంలో మేకలతో పాటు కాపరి రాజుపై చిరుత దాడి చేసిన స్థలాన్ని ఫారెస్టు అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి చిరుత దాడి చేసిన ప్రదేశానికి వెళ్లిన అటవీశాఖ అధికారులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజు ఇంటికి వెళ్లి పరిశీలించారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు, పశువుల కాపరులు, మేకల కాపరులు ఒంటరిగా అటవీ ప్రాంతం వైపు వెళ్లొద్దన్నారు. ఒకవేళ చిరుత ఆనవాలు కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ పరిశీలనలో సెక్షన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ రవికిరణ్‌తో పాటు గ్రామస్తులు ఉన్నారు.

108లో ప్రసవం



పుట్టిన బిడ్డను కుటుంబ సభ్యులకు అందజేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పోచారానికి చెందిన భాగ్యలక్ష్మి అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో 108 వాహనంలో తరలిస్తున్నారు. మార్గమధ్యలోకి రాగానే నొప్పులు అధికం కావడంతో సిబ్బంది ప్రసవం చేశారు. దీంతో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీస్‌లు సీజ్‌చేసిన ఇసుక ట్రాక్టర్లు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధరిపల్లిలో అక్రమంగా ఇసుకు తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. ధరిపల్లి శివారులోని వాగునుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచరం మేరకు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్లను సీజ్‌చేసీ కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

దుబ్బాకరూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ హరీశ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పుసుకూరి సతీశ్ పలు గ్రామాల్లో ప్రతి ఇల్లు తిరిగి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడు. వాటిని ఎక్కువ ధరకు కోళ్ల ఫారాలకు ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ట్రాక్టర్‌ను గ్రామ శివారులో పోలీసులు పట్టుకుని తనిఖీ చేశారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మిరుదొడ్డి ఎంఎల్‌సీ పాయింట్‌కు, ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆ కాలనీకి ఆరు పేర్లు

గజ్వేల్: ఎక్కడైనా ఒక కాలనీకి ఒకటే పేరు ఉంటుంది. కానీ సిద్దిపేట జిల్లా గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మాత్రం ఒకే కాలనీకి ఆరు పేర్లు ఉన్నాయి. వివరాలు.. మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఎదురుగా ఉన్న కాలనీకి ఆరు పేర్లతో నామకరణం చేయడం చర్చనీయాంశంగా మారింది. కొన్నేళ్ల క్రితం ఏర్పడ్డ ఈ కాలనీని మొదటి నుంచే రెండు, మూడు రకాల పేర్లతో పిలుచుకున్నారు. తాజాగా శుక్రవారం గతంలో ఉన్న రెడ్డి ఎన్‌క్లేవ్, వినాయకనగర్ కాలనీ బోర్డులకు అదనంగా యాదవ్స్ కాలనీ, ముదిరాజ్, విశ్వకర్మ, ఆర్యవైశ్య ఎన్‌క్లేవ్ అనే బోర్డులు వెలిశాయి. ఒకే కాలనీకి ఆరు రకాల పేర్లతో నామకరణం చేయడం రాష్ట్రంలోనే తొలిసారిగా చెప్పుకుంటున్నారు.



ఆరు రకాల పేర్లతో వెలిసిన బోర్డులు ఇవే

నా భర్త ఆచూకీ కనిపెట్టండి

మంత్రి పొన్నంకు జవాన్ భార్య విన్నపం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని ఐనపూర్ గ్రామానికి చెందిన తోట అనీల్ (ఆర్మీ జవాన్) ఆచూకీని కనిపెట్టాలని భార్య అనూష మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 6వ తేదీన ఇంటి నుంచి పంజాబ్‌లో విధి నిర్వహణకు వెళ్లాడని, మరుసటి రోజునుంచి సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తుందన్నారు. నెలరోజులుగా భర్త ఆచూకీ కోసం వెతికినా సరైన సమాధానం రాలేదని అనూష కన్నీరుమున్నీరయ్యారు. అక్కడి కమాండర్‌ను సంప్రదించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆమె అమ్మగారి ఇల్లు చౌటపల్లి గ్రామం కావడంతో మంత్రి మల్లంపల్లి–చౌటపల్లి గ్రామాల బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి వస్తున్నారని తెలుసుకుని వచ్చారు. పూర్తి వివరాలతో కూడిన ఒక లెటర్‌ను మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేస్తే పంజాబ్‌లోని ఆర్మీ కమాండర్‌తో మాట్లాడి వివరాలను తెలియజేస్తామని మంత్రి భరోసా కల్పించారు.



భర్త ఆచూకీ కనిపెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవిస్తున్న అనూష

నిమ్జ్ భూబాధితులకు బాసట

- వారి పక్షాన రాజీలేని పోరాటం చేస్తాం
- భూసేకరణ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాలు
- వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్



జహీరాబాద్‌లో నిమ్జ్ భూబాధితుల ర్యాలీ

జహీరాబాద్ టౌన్: ఎన్నో ఉద్యమాలు, పోరాటాల తర్వాత రైతులకు మేలు చేసే 2013 భూసేకరణ చట్టాన్ని ప్రభుత్వాలు ఉల్లంఘిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆరోపించారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం చట్టానికి వ్యతిరేకంగా బలవంతంగా భూములను తీసుకోవడానికి నిరసిస్తూ శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రామిక్ భవనం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం నిమ్జ్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ సమగ్ర భూచట్టాలను అమలు చేస్తే రైతులకు పరిహారం ఎక్కువగా ఇవ్వాల్సి వస్తుందని ప్రభుత్వాలు స్వార్థప్రయోజనాల కోసం భూసేకరణ చట్టానిక తూట్లు పొడుస్తున్నాయని మండిపడ్డారు. భూముల ధరలను సవరించకుండా ఏకపక్షంగా నిమ్జ్ భూసేకరణకు ఎందుకు నోటిఫికేషన్లు వేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. రెండు పంటలు పండే సారవంతమైన భూములకు 15 లక్షల పరిహారం ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరం రూ.50 లక్షలు పలుకుతుంటే రూ.15 లక్షలు ఎలా ఇస్తారన్నారు. చట్ట ప్రకారం భూమిలేని కూలీలకు పునరావాసం కూడా ఇవ్వడంలేదన్నారు. రైతుల భూముల్లో పనులు చేపడుతూ చట్టాన్ని ఉల్లఘిస్తున్నారని ఆరోపించారు. పరహారం పెంచాలని, ఎకరానికి 120 గజాల ప్లాటు, వ్యవసాయ కూలీలకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జిల్లా అధ్యక్షులు బి.రాంచందర్, నాయకులు సుకుమార్, నర్సింలు, శంకర్, సీఐటీయూ నాయకులు మహిపాల్, నిమ్జ్ భూబాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

మహిళ కడుపులోంచి 3.2 కిలోల గడ్డ తొలగింపు

దుబ్బాక: ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి మహిళ ప్రాణాలు కాపాడారు. వివరాలు ఇలా.. మండలంలోని హబ్షీపూర్ గ్రామానికి చెందిన శోభ(43) కొన్ని నెలలుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుంది. ఎన్నో ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం దుబ్బాక వంద పడకల ఆస్పత్రికి రాగా వైద్యులు ఆమెకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి కడపులో పెద్ద గడ్డ ఉందని నిర్ధారించారు. శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించి శోభ కడపులోంచి 3.2 కిలోల పెద్ద ఫైబ్రాయిడ్ గడ్డను తొలగించారు. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య బృందాన్ని బాధిత కుటుంబీకులు అభినందించారు.



హేమరాజ్‌సింగ్‌తో వైద్యబృందం

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొండపాక(గజ్వేల్): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రవీంద్రనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రవీంద్రనగర్ గ్రామానికి చెందిన నాలగం కనకయ్య(40) బీడీ కంపెనీలో పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. శుక్రవారం పని ఉండడంతో తన ఇంటిపైకి వెళ్లాడు. బిల్డింగ్‌పైన ఉన్న డిష్ వైర్‌ను సరిచేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో కరెంట్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుకునూర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



కనకయ్య

వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలి

యువశాస్త్రవేత్తలకు అవగాహన కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ గోపాల్‌లాల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): వ్యవసాయాభివృద్ధికి యువశాస్త్రవేత్తలు కృషి చేయాలని ఐసీఏఆర్ డైరెక్టర్ గోపాల్‌లాల్ తెలిపారు. మండలంలోని శిలాంపల్లిలో కొడిపల్లి మండలం తునికి కేవీకే, ఐసీఏఆర్ (ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నామ్(నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రిసర్చ్ మేనేజ్‌మెంట్) ఆధ్వర్యంలో శుక్రవారం 115వ వ్యవసాయ పరిశోధన శిక్షణ కార్యక్రమంలో భాగంగా 22రాష్ట్రాలకు చెందిన 107మంది యువశాస్త్రవేత్తలకు వ్యవసాయంపై అవగాహన, రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాల్‌లాల్ మాట్లాడుతూ...వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు యువశాస్త్రవేత్తలు ఆధునిక పద్ధతులను రైతులకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు క్షేత్రపర్యటన నిర్వహించి రైతులతో మాట్లాడారు. సాగు పెట్టుబడులు, నీటియాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, దిగుబడి, మార్కెటింగ్ గురించి వివరించారు. అనంతరం గ్రామం చిత్రపటాన్నివేసి యువశాస్త్రవేత్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే విభాగాధిపతి డాక్టర్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ రవికుమార్, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, ఐసీఏఆర్ ప్రతినిధులు డాక్టర్ దామోదర్‌రెడ్డి, డాక్టర్ వెంకట్‌కుమార్, డాక్టర్ వెంకటేశన్, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గోపాల్‌లాల్

కార్లు అద్దెకు తీసుకుని..

- విక్రయిస్తున్న ముఠాలో ఒకరి అరెస్టు
- ఆరు కార్లు స్వాధీనం..

సిద్దిపేటకమాన్: కార్లు కిరాయికి తీసుకుని విక్రయిస్తున్న ముఠాలో ఒక సభ్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన సమీర్ తన వద్ద రంగారెడ్డి జిల్లా చర్లపటేల్ గూడకు చెందిన పట్నం నరేశ్ కారును అద్దెకు తీసుకెళ్లి తిరిగి ఇవ్వడం లేదని ఆగస్టు 23న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా నిందితుడు ఇబ్రహీంపట్నంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నరేశ్, చిన్నకోడూరుకు చెందిన మిద్దెల మహేశ్, రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన శేఖర్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మాత్య, నల్గొండ జిల్లాకు చెందిన సంతోష్ ఐదుగురు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. కొంతకాలంగా కార్లను అద్దెకు తీసుకుని, తాకట్టు పెట్టడం, కొన్నింటిని విక్రయించి వాటి ద్వారా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. ఆరు నెలలుగా సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి ప్రాంతాల్లో 17 కార్లు కిరాయికి తీసుకుని విక్రయించారు. నిందితుడు నరేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి ఆరు కార్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నలుగురిని త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న కార్లు, నిందితుడితో సీఐ ఉపేందర్, ఎస్‌ఐ ఆసిఫ్

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

యువకుడు ...

పటాన్‌చెరుటౌన్: యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన వీరేశ్ (22) గురువారం డ్యూటీకి వెళ్తున్నానని వెళ్లి తిరిగి రాలేదు. అదే రోజు సాయంత్రం తన అన్న విట్టల్ వాట్సాప్‌కు 'నాకు కలలో దేవుడు ఒక స్థలాన్ని చూపించాడు అక్కడికి వెళ్తున్నానని మెసేజ్ పెట్టాడు'. వెంటనే ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. తమ్ముడి అదృశ్యంపై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వీరేశ్

మహిళ...

నర్సాపూర్ రూరల్: గిరిజన మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని తుజల్‌పూర్ పంచాయతీ పరిధిలోని అర్జున్ తండాలో జరిగింది. ఎస్సై జగన్నాథం కథనం ప్రకారం.. తండాకు చెందిన కొర్ర పవన్ భార్య మౌనిక (20). గురువారం మధ్యాహ్నం బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకడంతో పాటు బంధువులు, తెలిసిన వారిని ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



మౌనిక

బాలుడు ...

తూప్రాన్: మతి స్థిమితం సరిగాలేని బాలుడు అదృశ్యం అయ్యాడు. ఈ ఘటన ఘనపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్‌కు చెందిన మనోజ్‌ప్రసాద్ అనే వ్యక్తి కొంతకాలంగా ఘనపూర్ సమీపంలోని ఓ సీడ్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఇతని పెద్ద కుమారుడు సందీప్‌కుమార్(16)కు చిన్నప్పటి నుంచి మతి స్థితిమితం సరిగా లేదు. హైదరాబాద్‌లో వైద్యం చేయించేందుకు బిహార్ నుంచి ఇటీవల తీసుకువచ్చాడు. ఈ క్రమంలోనే ఈ నెల 8న సందీప్‌కుమార్ కనిపించకుండా పోయాడు. చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సందీప్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన తాటి సరోజన((60), తాటి వెంకటేశం దంపతులు హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి గురువారం సాయంత్రం బస్సులో గజ్వేల్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో పట్టణంలో పిడిచెడ్ రోడ్డు వైపు వెళ్తుండగా పిడిచెడ్ నుండి తూప్రాన్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ టైర్ల కింద పడిన సరోజన కాళ్లు నుజ్జునుజ్జవగా, వెంకటేశం ఎడమ కాలుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సరోజన మృతి చెందింది.

వృద్ధురాలి గొలుసు చోరీ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని పిట్టలకేరీలో వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పరారైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పిండిగిర్నీ వద్ద కూర్చున్న చంపాబాయి వద్దకు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి మాట్లాడుతున్నట్లు నటించి ఆమె మెడలోని తులం బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

నీవు లేని లోకంలో ఉండలేను..

- భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య ఆత్మహత్య
- అనాథలైన పిల్లలు

సిద్దిపేటరూరల్: అనారోగ్యంతో భర్త మృతిచెందగా, ఒకరోజు గడవక ముందే భార్య ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. చిన్నకోడూరు ఎస్‌ఐ సైఫ్‌అలీ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొబ్బరిచెట్టు మహేందర్(40)కు చిన్నకోడూరు మండలం సికింద్లాపూర్‌కు చెందిన కావ్యతో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. దంపతులిద్దరూ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం మహేందర్ అనారోగ్యానికి గురి కాగా, సిద్దిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబీకులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో భర్త మృతిని జీర్ణించుకోలేని భార్య కావ్య గంటల వ్యవధిలోనే ఇంట్లోకి వెళ్లి గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించగా, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కావ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతిచెందిన దంపతులు

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య

పెద్దశంకరంపేట(మెదక్): జైలు నుంచి వచ్చిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ముసాపేటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బైకాని దేవయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇందులో చిన్నవాడైన బైకాని గంగమేశ్వర్‌కు కొన్నేళ్ల క్రితం టేక్మాల్ మండలం హసన్‌మహ్మద్‌పల్లికి చెందిన మానసతో వివాహం జరిగింది. గంగమేశ్వర్ అత్తగారింటికి ఇల్లరికం వెళ్లాడు. మూడు నెలల క్రింతం కుటుంబ కలహాల నేపథ్యంలో మానస ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో గంగమేశ్వర్‌పై కేసు నమోదు కాగా జైలుకు కెళ్లాడు. ఇటీవలే జైలు నుంచి వచ్చాడు. శుక్రవారం కోర్టుకు హాజరుకావాల్సి ఉండగాఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు వెతుకుతుండగా గ్రామశివారులోని బావిలో మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



గంగమేశ్వర్



పూలే గురుకులంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

పరిచయోల్లాసం..

గురుకులంలో ఫ్రెషర్స్‌కు ఆత్మీయ స్వాగతం

వర్గల్(గజ్వేల్): పరిచయ్ అలరించింది. చదువుల నెలవు గురుకులం వైపు అడుగులేసిన ఫ్రెషర్స్‌కు సీనియర్ల ఘన స్వాగతం లభించింది. 'పరిచయ్' పేరిట శుక్రవారం వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వేదికగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలతో పండుగ వాతావరణం నెలకొంది. అర్చన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, విద్యార్థినుల ప్రదర్శనలు అందరిని అలరింపజేశాయి. అనంతరం స్పోర్ట్స్‌డే పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, దేదీప్య, జయ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోల్కంపల్లి సంజీవులు(39) కూలీ పని చేస్తుంటాడు. మద్యానికి బానిసైన ఆయన శుక్రవారం మండలంలోని ఆత్మకూర్ శివారులోని రావుల చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రక్షించేందుకు స్థానికులు ప్రయత్నం చేసిన ఫలితం రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పోలంపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండి లక్ష్మి (42)కి పంచాయతీ కార్యదర్శి స్రవంతితో ఇటీవల గొడవ జరిగింది. ఈ గొడవపై గ్రామస్తులు గురువారం గ్రామ పంచాయతీ వద్ద మాట్లాడారు. అయితే ఆ తర్వాతి రోజే లక్ష్మి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పంచాయతీ కార్యదర్శితో జరిగిన గొడవపై మనస్థాపంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు బాధిత కుటుంబీకులు చెబుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.